RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 239 పేజీలు - 08 శనివారం 25 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు**

**పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ**

**క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై24:** నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం **మిగతా 2లో...**

# 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

**పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం.. -పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం**

**దోషులకు 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా సవరణలు**

**నీట్-యూజీ వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై24** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నూతన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం వ్యక్తిగత అక్రమాలకు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, **మిగతా 2లో...**

# సింగరేణి విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

**రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ**

**సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం**

**బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై24:** సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. **మిగతా 2లో...**

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

**నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ**

**నష్టపరిహారం, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం**

**ప్రధాన్ రాజీనామాపై శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం**

**మంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థుల స్పష్టీకరణ**

2లో.



# కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

**ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై24:** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన **మిగతా 2లో...**




# ఎన్‌టీఏ ప్రక్షాళన..

**47 మంది అధికారులపై వేటు**

**విశ్వసనీయతను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా 47 మంది అధికారుల తొలగింపు**

**పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానంలోనూ సంస్కరణలు**

**నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భారీ మార్పులకు సన్నాహాలు**




2లో.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

**ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు**



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 24:** డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి **మిగతా 2లో...**

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

**జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి**

**ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు**

**పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం**

**అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



2లో.

# నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

**విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్**

**నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య**

**ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై24:** ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని **మిగతా 2లో...**



## కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం

**మొదటిపేజీ తరువాయి**

కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.÷ల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌టీఏ ప్రక్షాళన.. 47 మంది అధికారులపై వేటు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై24**

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంస్థ విశ్వసనీయతను పునరుద్ధరించే లక్ష్యంతో ఎన్‌టీఏలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 47 మంది అధికారులను విధుల నుంచి తొలగించింది.రాబోయే నెల రోజుల్లో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భవిష్యత్తులో ఎలాంటి లీకేజీలకు, అవకతవకలకు తావులేకుండా అత్యంత పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలగించిన 47 మంది అధికారులతో పాటు, మరికొందరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా పూర్తిగా మార్చాలని, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని భావిస్తోంది.ఈ ఏడాది జరిగిన నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంటులో విపక్షాల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఈ చర్యలు చేపడుతోంది.తాజా మార్పులు కేవలం స్వల్ప సర్దుబాట్లు కాదని, వ్యవస్థను సమూలంగా మార్చే 'ఫండమెంటల్ రీసెట్' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 కీలక జాతీయ స్థాయి పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రవేశ పరీక్షల పవిత్రతను కాపాడటమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం.

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

**మొదటిపేజీ తరువాయి**

కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు.నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు.ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

## 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

**మొదటిపేజీ తరువాయి**

రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. వ్యవస్థీకృత నేరాలకు ఇప్పటికే కఠిన శిక్షలు ఉన్నప్పటికీ, తాజా సవరణలతో వాటిని మరింత పటిష్ఠం చేయనున్నారు.దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్-యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరిణామంతో పాటు పలు ఇతర పోటీ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకోవడంతో విద్యార్థి లోకం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

**మొదటిపేజీ తరువాయి**

పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ÷ద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు.

డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు.

డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**

దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**

సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమిక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంవ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో ÷-లబెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ఎ÷-లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని అన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు. సెమికండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని బట్టి విక్రమార్క అధికారులకు దిశా నిర్దేశంచేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై24:**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

"రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు.

ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

**అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 24:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై జరిగిన సమీక్షలో అధికారులు మంత్రి దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు. న్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయని వెల్లడించారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందు ఉంచాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాకుండా బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం. ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు.

# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- దళిత రత్న,జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 24:** నీట్,జేఈఈ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు పూర్తి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని దళిత రత్న, జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్ డిమాండ్ చేశారు.ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ పిలుపునిచ్చిన బంద్‌కు జాతీయ మాలమహానాడు సంపూర్ణ మద్దతు తెలిపిన సందర్భంగా తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిట్టిమల్ల మహేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో సంవత్సరాల కష్టపడి, తల్లిదండ్రులు భారీగా ఖర్చు చేసి నీట్ పరీక్షలకు సిద్ధమవుతారని అన్నారు. అలాంటి కీలకమైన పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే అత్యంత బాధాకరమైన ఘటన అని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన, అనిశ్చితి నెలకొందని విమర్శించారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై నిజానిజాలను వెలికితీసేందుకు సమగ్ర, పారదర్శక దర్యాప్తు జరిపి, ఈ కుట్రలో ప్రమేయం ఉన్న వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమని విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని కేంద్ర ప్రభుత్వం, వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయన్ను పదవి నుంచి బర్తరఫ్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని చిట్టిమల్ల మహేష్ డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తును కాపాడేందుకు పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సూర్వి మల్లేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 24:** చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సూర్వి మల్లేష్ గౌడ్ జన్మదిన వేడుకలను గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సర్పంచ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా సూర్వి మల్లేష్ గౌడ్ సేవలను పలువురు కొనియాడారు. ఆయన నాయకత్వంలో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టబడ్డాయి.ఈ సందర్భంగా సూర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు, మహిళలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# వి బి జి రాంజీ పథకాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**వ్యవసాయానికి పెంచిన కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందుల ధరలను తగ్గించాలి.**

**వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసే అమెరికాతో, మోడీ చీకటి ఒప్పందని రద్దు చేసుకోవాలని డిమాండ్.**

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 24:** వి బి జి రామ్ జి పథకాన్ని రద్దుచేసి పాత మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పార్టీ తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో హరిపిరాల, కర్కాల గ్రామాలలో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలు ప్రజలు, రైతులు, కూలీలను ఆడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం బొల్లం అశోక్ మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం పేరు మార్చి ఉపాధి కూలీల పొట్టగొట్టే కుట్రలు చేస్తున్నటువంటి కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, వి బి జి రాంజీ పథకంగా మార్చడం చాలా దుర్మార్గమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని, పథకంగా మార్చడం అంటే కూలీల పొట్ట కొట్టడమే అని ఈ సందర్భంగా వారు గుర్తుకు చేశారు. కూలీలకు దినసరి వేతనాలు కేంద్ర ప్రభుత్వం వాటా 60% రాష్ట్ర ప్రభుత్వం వాటం 40% అంటేనే ఈ పథకానికి తూట్లు పొడిచాడమని వారు ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అదేవిధంగా వ్యవసాయ రంగాన్ని కూడా కుదేలు చేయడానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, దానిలో భాగంగానే ఈ మధ్యకాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో భారత ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం అంటేనే వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించడం అని వారు అన్నారు. దానిలో భాగంగానే కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందుల ధరలు కూడా పెంచడం అని వారు ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ వ్యవసాయ కూలీలను రక్షించుకోవాలని కోరారు. ఈ అన్నిటి సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి కార్యక్రమంలో భాగంగా తొర్రూర్ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగే (జైల్ బరో) ధర్నా కార్యక్రమానికి ఉపాధి కూలీలు వ్యవసాయ కూలీలు రైతులు ప్రజలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బొల్లం మమత, దస్తరి భాగ్య, రైతులు, కూలీలు వెంకన్న, నరేష్ ,అశోక్, ఎస్.కె సాయిబెల్లి, వెంకటేశ్వర్లు, చెన్నబోయిన కొంరెల్లి,అమృత సత్యమ్మ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తల్లి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించిన మసీద్‌గూడెం గ్రామ సర్పంచ్ మర్రి వంశీదర్ రెడ్డి కుటుంబం






**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 24:** మసీద్‌గూడెం గ్రామానికి చెందిన కీ.శే. శ్రీమతి మర్రి సరస్వతి (జౌ/శీ మర్రి శ్యాంసుందర్ రెడ్డి) గారిని స్మరించుకుంటూ, వారి కుమారుడు మసీద్‌గూడెం గ్రామ సర్పంచ్ మర్రి వంశీదర్ రెడ్డి, కుమార్తె కళ్లెం మానస రెడ్డి, అల్లుడు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.తమ తల్లి చిన్నతనంలో విద్యాభ్యాసం చేసిన నేలపట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు పాఠశాల అవసరాల కోసం ఒక బీరువాను ఉపాధ్యాయులకు అందజేశారు.అనంతరం పెద్దకొండూర్‌లోని సాయి యాదాద్రి సేవా ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, ఆశ్రమ వినియోగం కోసం ఒక బీరువాను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లిదండ్రుల జ్ఞాపకాలను సమాజ సేవ ద్వారా చిరస్థాయిగా నిలుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి రాంరెడ్డి, నేలపట్ల సర్పంచ్ గంగాపురం నగేష్, మందోళ్లగూడెం ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి, పెద్దకొండూర్ మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, పెద్దకొండూర్ ఉపసర్పంచ్ పిన్నిటి శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు పడమటి ఉమాదేవి, పడమటి బలవంత్ రెడ్డి, సుర్కంటి సురేందర్ రెడ్డి, వాకిటి శివారెడ్డి, రామిడి జంగా రెడ్డి పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**

**గిర్కటి నిరంజన్ గౌడ్ మల్కాపురం సర్పంచ్.బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు చౌటుప్పల్**





**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 24:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం (24-07-2026) చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్ ఉచితంగా పంపిణీ చేసి మానవతా సేవను చాటుకున్నారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల్ దామోదర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు శేఖర్ గౌడ్, యాదయ్య, ఢిల్లీ మాధవ రెడ్డి, పరమేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, పర్వతాలు యాదవ్, శ్రీకాంత్, అత్తర్ పాషా, మెట్టు మహేశ్వర్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామన్నపేటలో కేటీఆర్ జన్మదిన వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** రామన్నపేటలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ ఐటీ శాఖ మంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి50 వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆరోగ్యంగా ఉండాలని కోరుతున్నారు.మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం ఇంద్రపాలనగరం సిరిపురం సర్పంచులు గర్దాస్ విక్రమ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి మాజీ సర్పంచులు ఎంపీటీసీలు రేఖ యాదయ్య బందెల యాదయ్య ఎండి అమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం ఎస్కే చాంద్ పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు కూనూరు ముత్తయ్య మిర్యాల మల్లేశం బాలగోని నరసింహ బొడ్డు అల్లయ్య లవణం రాము రవ్వ నరసింహ ఆవుల నరేందర్ జెట్టి శివప్రసాద్ మామిళ్ళ కుమార్ బుర్ర శ్రీశైలం నల్ల సైదులు గాదె శంకర్ కట్ట భాను శ్రీ రాస వెంకటేశ్వర్లు మోటి రవీందర్ గర్దాస్ కరుణాకర్ ఎండి అజాజ్ ఖాన్ లవణం ఉపేందర్ నక్క శంకరయ్య లింగారావు బొడ్డుపల్లి రాజు చిప్పలపల్లి రవి నోముల లింగస్వామి బాసాని రాజు బీరం రాజిరెడ్డి మేడబోయిన మహేష్ గట్టు రాములు సంగిశెట్టి శివ రేమిడాల వెంకన్న వంగాల సాయి సంఘీ ఐలయ్య కొమ్మనగోని రమేష్ మోటె నరేష్ గంగాదేవి జంగయ్య నోముల పెద్ద శంకర్ ఏషబోయిన బిక్షం కోసనీ అంజయ్య గట్టు సోములు రాము అంజయ్య వెంకన్న పాల్గొనడం జరిగింది

# భద్రాచలం అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్ ధర్మకర్త సభ్యులుగా గోషిక వినయ్ కుమార్ చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్,బడుగు రవి కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**పద్మశాలి సమాజానికి గర్వకారణం**


**సేవా భావంతో సంస్థ అభివృద్ధికి**

**విశేష కృషి చేస్తారంటూ హర్షం**

**వ్యక్తం చేసిన పలువురు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 24:** అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్, భద్రాచలం ధర్మకర్త సభ్యులుగా చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ప్రముఖ సామాజిక సేవకుడు బడుగు రవి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పద్మశాలి సమాజ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ ఎన్నిక పద్మశాలి సమాజానికి దక్కిన గౌరవమని, సమాజ సేవ పట్ల వీరిద్దరికీ ఉన్న నిబద్ధత, ప్రజలతో ఉన్న అనుబంధానికి ఇది నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. భక్త మార్కండేయ మహర్షి ఆశీస్సులతో భద్రాచలం పద్మశాలి భవన్ మరింత అభివృద్ధి చెందే దిశగా వీరు సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గోషిక వినయ్ కుమార్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేసుకుంటూ చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్‌గా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే బడుగు రవి కుమార్ కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పద్మశాలి సమాజ ఐక్యతకు కృషి చేస్తున్నారని తెలిపారు.భక్త మార్కండేయ పద్మశాలి భవన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యువతను సంఘ సేవ వైపు ప్రోత్సహించడం, సమాజ అభ్యున్నతికి దోహదపడే



కార్యక్రమాలను చేపట్టడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్ దేశవ్యాప్తంగా పద్మశాలి సమాజ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రబిందువుగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, నూతనంగా ధర్మకర్త సభ్యులుగా ఎన్నికైన గోషిక వినయ్ కుమార్, బడుగు రవి కుమార్ కి మరోసారి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి పదవీకాలంలో సంస్థ అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహించి, సమాజానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.



# రోడ్డు ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యం

- ప్రతి వాహనదారుడు సరైన పత్రాలను కలిగి ఉండాలి
- ఎం. రవికుమార్ సిఐ రామన్నపేట





**తొలి అక్షరం/రామన్నపేట జూలై 24:** రామన్నపేట పట్టణ కేంద్రంలో రామన్నపేట సిఐ ఎం రవికుమార్ ఎస్సై జి సతీష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేయడం జరిగినది. అనంతరం సిఐ ఎం రవి కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో శాంతిభద్రతలు కాపాడడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రతి వాహనదారుడు సరైన పత్రాలను కలిగి ఉండాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట పోలీస్ సిబ్బంది వాహనదారులు తదితరులు పాల్గొన్నారు

# మేక్ ఇన్ ఇండియా కాదు... లీక్ ఇన్ ఇండియాగా మార్చిన బీజేపీ ప్రభుత్వం

## ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మెడబోయిన మమత విమర్శ

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతం, కేంద్ర విద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం




**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన "మేక్ ఇన్ ఇండియా" నినాదం ఆచరణలో "లీక్ ఇన్ ఇండియా"గా మారిందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మెడబోయిన మమత తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రామన్నపేటలో నిర్వహించిన కళాశాల బంద్ విజయవంతంగా, సంపూర్ణంగా జరిగింది. విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులను బహిష్కరించి బంద్‌కు మద్దతు తెలిపారు. అనంతరం సుభాష్ సెంటర్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున చేరుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెడబోయిన మమత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వరుసగా ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతూ లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జంతర్ మంతర్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అత్యంత అమానుషమని, ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను అణచివేయడం ద్వారా పరిష్కారం లభించదని, ప్రశ్నాపత్రాల లీకేజీలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రాము, మండల నాయకులు అడ్ల నవదీప్,, షిరసు మనోజ్, రూపని అవినాష్, షేక్ సయ్యద్,పిట్టల నవీన్,తుర్కపల్లి లోకేష్,యాట కార్తిక్, బోనగిరి లోకేష్, మానస, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# వినూత్నంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు : చినపాక రమేష్ 7వ వార్డ్ మెంబెర్



**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** మండలంలోని నీర్నెముల గ్రామంలో కేటీర్ 50వ జన్మదినం వేడుకలు వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేసిన గ్రామానికి చెందిన 7వ వార్డ్ మెంబర్ చినపాక రమేష్. కేటీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చినపాక రమేష్ తన వ్యవసాయ క్షేత్రంలో వరి నాటు వేసే మొక్కలను కేటీఆర్ అనే ఆంగ్ల అక్షరాలతో పేర్చి కేటీర్ మీద ఉన్న అభిమానాన్ని శుభాకాంక్షలు తెలిపి చాటుకున్నాడు. రాబోయే కాలంలో కేటీర్ నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేసారు.

# కల్లుగీత కార్మికుల పోస్టర్ ఆవిష్కరణ



**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** కల్లుగీత కార్మికుల హక్కులకై జరిగే గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ సమావేశం కూనూరు మల్లేశం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గాజుల ఆంజనేయులు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై ఆగస్టు 2 నుండి 18 వరకు మానుకోట నుండి ట్యాంక్ బండ్ వరకు కల్లుగీత అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర కొనసాగుతుందని ఆ దిశలో భాగంగా ఆగస్టు 9 ఆదివారం రామన్నపేటకు వస్తున్న బస్సు యాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ జయప్రదం చేయాలని కోరుతూ బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలకు గురైన కార్మికులకు వెంటనే ఎక్స్గ్రేషియా విడుదల చేయాలని, కల్లుగీత వృత్తి రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించి నిధులు కేటాయించాలని, కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, గీత కార్మికులకు ప్రభుత్వ బీమా కల్పించాలని, ప్రమాదంలో మరణించిన గీత కార్మికునికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఆసరా పెన్షన్ 4000, వికలాంగులు అయిన కార్మికునికి 6 వేల రూపాయలకు పెంచి పెన్షన్ ఇవ్వాలని, వృత్తి సామాగ్రి, భద్రత సామాగ్రి మరియు ద్విచక్రవాహనం ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి బావండ్లపల్లి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కూనూరు మల్లేశం, మునికుంట్ల లెనిన్, మండల కమిటీ సభ్యులు పబ్బు సత్తయ్య, పబ్బు వెంకన్న, పబ్బు శేఖర్, గంగాదేవి అంజయ్య, పల్సం కనకయ్య, పల్లె సత్యం, పబ్బు స్వామి, కూనూరు మహేష్, బావండ్లపల్లి సత్యం, కూనూరు అంజయ్య, సుర్వి నవీన్, గోపగోని శంకరయ్య, గంగాపురం గోపాల్, గోపగోని వీరస్వామి, కమ్మగాని అశోక్, వీరమల్ల ముత్తయ్య పాల్గొన్నారు.

# రాజు కుటుంబానికి అండగా హెవీ ట్రక్ జాబర్స్... బియ్యం, సరుకుల అందజేత



**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** రామన్నపేట(మం) వెల్లంకిలో బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు గూని రాజు తండ్రి పెద్ద లింగయ్య(68) ఇటీవలే గుండెపోటుతో మృతి చెందారు. ఆపదలో ఉన్న వారి కుటుంబానికి గ్రామంలోని హెవీ ట్రక్ జాబర్స్ అండగా నిలిచారు. వారికి తోచిన రూపంలో బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. భవిష్యత్తులోనూ వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జినుక రాజు, చేగూరి నర్సింహ్మ, గూని నాగరాజు, ఎల్లస్వామి, గణేష్, దేవమ్మ, మహేష్, సురేష్, కుర్మ నర్సింహ్మ, జంపల్లి వెంకటేష్ ఉన్నారు.

# రామన్నపేట సిఐని సన్మానించిన మాజీ సర్పంచ్



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 24:** రామన్నపేట మండలానికి నూతనంగా వచ్చిన సర్కిల్ ఇన్స్పెక్టర్ మోలుగురి రవి ని మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించిన రామన్నపేట మాజీ సర్పంచ్ పూస . బాల నరసింహ ఆయన వెంట ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగొని వెంకటేష్ ,మాజీ ఉపసర్పంచ్ గర్ధసు సురేష్,సీనియర్ నాయకులు నజీర్ పాల్గొనారు.

# విద్యార్థుల పేరుతో కాంగ్రెస్ పార్టీ అరాచకం.



- 12 వేల కోట్ల ఫీజు బకాయిలు కనిపించవా..?
- అధికారంలో ఒకలా..ప్రతిపక్షంలో మరోలా.
- ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసం రాజకీయాలు.
- కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు
- నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్.

**తొలి అక్షరం/నెక్కొండ జూలై 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల కోసం కాకుండా..రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేస్తోందని, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా..ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని, నీచమైన రాజకీయాలతో కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పుడో కాలగర్భంలో కలిపిన విషయాన్ని గుర్తుంచుకోవాలని నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ నీచమైన సంస్కృతిపై ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ విద్యార్థుల సమస్యలపై స్పందించని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇప్పుడు విద్యార్థుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రూ.12 వేలకోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని ప్రభుత్వం..ఇతర అంశాలపై రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఈ నిరసన విద్యార్థుల కోసం కాదని..బీజేపీకి పోటీగా నిలబడేందుకే కాంగ్రెస్ నిరసనలు చేస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట..ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనాయిని అనూష అశోక్ తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ విధ్వంసాలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న సాగునీరు అందించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. రైతులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అరాచకం మూకల్లా వ్యవహరించారని ఆరోపించారు. ఒకవైపు దేశ రాజధానిలో విధ్వంసాలు సృష్టిస్తూ..మరోవైపు పోలీస్ ల అండతో రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడడం కాంగ్రెస్ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలపై బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయిని అశోక్ అనూష స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల ఉపాధ్యక్షులు దామచర్ల రామారావు. శ్రీరంగం సంపత్. ప్రధాన కార్యదర్శి. రాంపల్లి రాజగోపాల్. సీనియర్ నాయకులు. సింగారపు సురేష్. అంబాల రాంగోపాల్. మండల కార్యదర్శి. కొయ్యడ అనిల్. ఇండ్ల యకాంబ్రం, ఎస్టీ మోర్చా అధ్యక్షులు లావుడియా శ్రీనివాస్. ఎస్సీ మోర్చా అధ్యక్షులు పసుల అశోక్. ఇండ్ల సతీష్,మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎండి కాజా. యువ మోర్చా అధ్యక్షులు కుడికాల సుధీర్. ముఖ్య నాయకులు అంబాల సుధీర్. కెక్కెర్ల అనీల్. మాచర్ల రాజేందర్. గులోతు నరేష్. లావుడియాలపతి. రాగం రాజేందర్. భరతం రాజు. మొగిలి. పొన్నాల రవీందర్. యాగంబరం. హర్షవర్ధన్ బొట్టుపెల్లి. ఇల్ల సతీష్. ఇండ్ల యాకాంతం, .కేతిరి రాజశేఖర్ నెక్కొండ మండల బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

# సిరిపురం గ్రామంలో సీనియర్ సిటిజన్స్ సమావేశం

**తొలి అక్షరం/రామన్నపేట జులై 24:** సీనియర్ సిటిజన్స్ 2007 చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ఆర్‌సి. నెం. 590/C2/WSW/2023-26 ద్వారా వచ్చిన అన్ని అవకాశాలను వినియోగించుకుని సీనియర్ సిటిజన్స్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోలు నరసయ్య అన్నారు.... సిరిపురంలో సీనియర్ సిటిజన్స్ రామన్నపేట మండల అధ్యక్షులు జెల్ల శ్రీరాములు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు... రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ ఒక్క సీనియర్ సిటిజన్స్ కు ఇబ్బందులు కలిగిన మా దృష్టికి తీసుకురావాలని ఇట్టి విషయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు.... ఏ సీనియర్ సిటిజన్ ఎలాంటి నిరాదరణకు గురికాకుండా చూడడమే మా లక్ష్యం అనే అన్నారు. ఈ యొక్క సమావేశంలో రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా , సీనియర్ సిటిజన్స్ నాయకులు అప్పం రామేశ్వరం, మిరియాల భాస్కర్, కూనూరు సుదర్శన్, రాపోలు పుండరీకం, పగడాల గణేష్, ఏలే నరసింహా తదితరులు పాల్గొన్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలి

**విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం**

**రాహుల్ గాంధీపై లాటి చార్జి దుర్మార్గం**

**మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**

**గోకుల్ జంక్షన్లో ధర్నా నిరసన ప్రదర్శన**







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యుడైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రివర్గం నుంచి భర్త రఫ్ చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు.కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని గోకుల్ జంక్షన్లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిరసన ప్రదర్శన చేశారు.మోడీ హటావో దేశ్ కో బచావో అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ...పరీక్షా పత్రాలను లీకు చేసి కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని దుయ్యబట్టారు.దేశంలో అసమర్థ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు,ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు.ఢిల్లీలో విద్యార్థుల ధర్నాకు మద్దతుగా నిరసన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ పై లాఠీ చార్జీ చేయడం దుర్మార్గమని అన్నారు.రాహుల్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోడీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు.నీట్ పరీక్ష విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ నేతృత్వంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ మాట్లాడుతూ...కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లీకేజీల చరిత్రను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు లాఠీ చార్జీలో గాయపడి మృతి చెందిన విద్యార్థినిది ప్రభుత్వ హత్య అని అన్నారు.దేశంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మొట్టే యామిని,జిల్లా ఉపాధ్యక్షురాలు కరుణశ్రీ,తేల్ల సుగుణ,నీలం రజిని,ఉపసర్పంచ్ కొమరమ్మ,రహీమున్నీసా,లలిత,స్వరూప,కవిత,కృష్ణవేణి ,జ్యోతి,ప్రశాంతి,నాయిని లక్ష్మారెడ్డి,కేతిడి దీపక్ రెడ్డి,రోండ్ల శ్రీను,అనిల్,కిషోర్,బంక చంద్రశేఖర్,ఎండి కరీం,పూరేళ్ళ రవి కిరణ్,శ్రీనివాస్ రెడ్డి,రాజకుమార్,ఎండి నేహాల్,రావుల భూపాల్,బోరింగు వెంకటయ్య,ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి మనోధైర్యమే గొప్ప ఆయుధం

- **'హైపర్సైట్ ' సాంకేతికత ద్వారా క్యాన్సర్ చికిత్స**
- **సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే హైపర్సైట్ మిషన్**
- **యశోద ఆసుపత్రి అంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** క్యాన్సర్ వ్యాధికి మనోధైర్యాన్ని మించిన వైద్యం మరొకటి లేదని సికింద్రాబాద్‌యశోద ఆసుపత్రి అంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు.హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ...యశోద ఆసుపత్రిలో రేడియేషన్‌ఆంకాలజీ విభాగంలో 'హైపర్సైట్ ' సాంకేతికత ద్వారా క్యాన్సర్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు.ఈ టెక్నాలజీద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతానికే రేడియేషన్ అందించడంతో మిగతా శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలాతక్కువగా ఉంటాయని వివరించారు.ఈ హైపర్సైట్ మిషన్ ఇండియాలో ఎక్కడ లేదని,ఒక్క సికింద్రాబాద్ యశోదఆసుపత్రిలో మాత్రమే ఉంటుందని,ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని ప్రజలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక సదస్సులునిర్వహిస్తున్నామని,వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనిఅన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అందించికోలుకునేలా చేశామని తెలిపారు.ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి రమేష్ వర్మ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలని డిమాండ్

**- రాస్తా రోకో ర్యాలీలో పాల్గొన్న టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.**





**తొలి అక్షరం/నెక్కొండ జూలై 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన మరియు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు అండగా నిలబడి ఢిల్లీలో ధర్నా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పై లాటించార్జ్ చేసి గాయపరిచిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాము పేపర్ లీకేజీల వల్ల మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున ఎక్స్గ్రేషియా ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో చిన్న కొర్పోలు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ అనిత- బద్రు నాయక్ సొసైటీ డైరెక్టర్ చింతల వేణుగోపాల్,గంగపురి చంద్రమౌళి, పబ్బతి సుధాకర్,కొయ్యడ రాజు,కొయ్యడ ఐలయ్య,కొయ్యడ సాంబయ్య, అన్నబోయిన పెద్దరాజు, గజ్జల సంపత్ మరియు ఇతరనాయకులు పాల్గొన్నారు.

# నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సీసీఎస్ పోలీసుల దాడి

- **రూ.1,96,430 విలువైన పొగాకు ఉత్పత్తుల స్వాధీనం**
- **చట్టపరమైన చర్యల నిమిత్తం ఎస్‌హెచ్‌ఒకి అప్పగింత**




**తొలి అక్షరం/భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సీసీఎస్ పోలీసుల దాడి చేసి రూ.1,96,430 విలువైన గుట్కా,పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు.భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.ఈ క్రమంలో భాగంగా సీసీఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని చాముండా జనరల్ స్టోర్స్,దుర్గా జనరల్ స్టోర్స్,పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో అంబర్,ఆర్ఆర్,అనార్,జేకే,మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించి, మొత్తం రూ.1,96,430 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఒ కి అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మాట్లాడుతూ...ప్రజారోగ్యానికి హానికరమైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయడం,విక్రయించడం లేదా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# దేశంలో అల్లర్లకు విదేశీ కుట్రలు జరుగుతున్నాయి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**రేవంత్ రెడ్డికేటీఆర్ కలిసి రాజకీయ డ్రామాఆడుతున్నారు**

**రంగారెడ్డి జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుంది**







**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24:** దేశంలో అల్లర్లు, విధ్వంసక చర్యలకు విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, దేశభక్తులైన యువత వాటిని తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనల వెనుక విదేశీ కుట్ర ఉందని ఆరోపించారు. విదేశాల నుంచి నిధులు, భోజనాల సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో కాంగ్రెస్ నేతల పాత్ర ఉందని ఆరోపిస్తూ, గత ప్రభుత్వాల హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై అప్పట్లో ఎవరూ రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో మాట్లాడకుండా ప్రధాని మోదీ నివాసం ఎదుట రాహుల్ గాంధీ ఆందోళనలు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు.'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో జరుగుతున్న ఉద్యమాల వెనుక నక్సలైట్లు, అసాంఘిక శక్తులు ఉన్నాయని ఆరోపించారు. దేశంలో అల్లకల్లోలం సృష్టించడమే కొందరి లక్ష్యమని, హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి కూడా నక్సలైట్లు హాజరయ్యారని పేర్కొన్నారు.తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వైఖరితో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రూప్-1, ఇంటర్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, ఆ సమయంలో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ, విద్యార్థుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని తమ సర్వేలు చెబుతున్నాయని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బొక్క నర్సింహారెడ్డి, రఘునాథ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కొప్పు భాషా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాజీపేట చౌరస్తాలో నీట్ పేపర్ లీక్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కాజీపేట చౌరస్తాలో నీట్ పేపర్ లీక్ విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ తో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ,అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాజీపేట కాంగ్రెస్ నిరసన తెలుపుతూ రాస్తారోకో చేశారు.టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి,పిలుపు మేరకు విద్యార్థుల పక్షాన మేమున్నాం! అని కాజీపేట కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమం నీట్ పేపర్ లీక్ పై విద్యార్థులకు మద్దతుగా నిరసన ప్రదర్శన చేశారు.నిరసన తెలిపిన అనంతరం జక్కుల రవీందర్ యాదవ్ తో పాటు మాజీ కార్పొరేటర్ లను కాంగ్రెస్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలను నిరసన చేసినందుకుగాను కాజీపేట సి ఐ శ్యాంసుందర్,పోలీసులు సిబ్బంది వారిని పోలీస్ స్టేషన్ కి తరలించారు.ఈ కార్యక్రమం లో కాజీపేట్ 62,63,47 డివిజన్ లకు సంబంధించిన 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి,ఆరూరి సాంబయ్య(రా.జ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు),మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్,గుంటి కుమారస్వామి,డా.శ్రవణ్,దొంగల కుమార్ సీరిల్ లారెన్స్,షైక్ ఆజగర్,షబ్బీర్(తబ్బు)(మైనారిటీ వైస్ ప్రెసిడెంట్),తమ్మడి మనసా మధు,మాచర్ల జయకర్,బర్లరాజకుమార్,పోగుల శ్రీనివాస్,మంతుర్తి బొంద్యాలు,శివరాం,రవి కిరణ్,సుంచు ప్రవీణ్,ప్రశాంత్,రజియా,కొండ శివ,జై రావు,ఎండి షకీల్ (మైనారిటీ జనరల్ సెక్రెటరీ )బొడ్డు రామ్,గాలి శీను,మాతంగి స్వామి,దార్ల రాజకుమార్,గోరుకాటి రవి,గుగ్గిళ్ళ అనిల్,శ్రీను,కాంగ్రెస్ కార్యకర్తలు,కాంగ్రెస్ మహిళా సోదరీమణులు,కాంగ్రెస్ కుటుంబం,పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవుని మాన్య భూమిని పరిరక్షించాలని కలెక్టర్‌కు వినతి



**తొలిఅక్షరం/నెక్కొండ జూలై 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో నుండి జిల్లా కలెక్టర్ సత్య శారదకు బొల్లికొండ గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామంలోని శ్రీ రాములవారి కళ్యాణ మహోత్సవాల కోసం వినియోగించే దేవుని మాన్య భూమిని కొందరు చెదను చేసి సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దేవుని మాన్య భూమిని పరిరక్షించడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో బానోతు రాంకోటి, గూగులోతు రమేష్, బానోతు విగన్, ధరావత్ రమేష్, గూగులోతు మాధర్, బానోత్ రమేష్, గూగులోతు రాములు, బానోతు చందూలాల్, బానోతు మహేష్, బానోత్ పవన్, డప్పు నవీన్, బానోత్ వెంకటేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సు.. లైసెన్స్ లేని డ్రైవర్

- బస్సు కింద పడి యూకేజీ విద్యార్థిని సహస్ర మృతి..
- షాద్‌నగర్ "ఎంవీఐ స్వప్న" విచారణలో సంచలన విషయాలు






**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 24:** రంగారెడ్డి జిల్లా చౌదర్‌గూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో శుక్రవారం జరిగిన విషాద ఘటనలో యూకేజీ విద్యార్థిని సహస్ర స్కూల్ బస్సు కింద పడి మృతి చెందిన ఘటనపై విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అభ్యాస్ విద్యాపీఠం పాఠశాలకు చెందిన ప్రమాదానికి గురైన బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని, బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని షాద్‌నగర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వప్న విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎంవీఐ స్వప్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సును తనిఖీ చేసి, ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక గ్రామ సర్పంచ్, ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌదర్‌గూడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న డ్రైవర్‌ను కలిసి ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంవీఐ స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థులను తరలించే బస్సుకు పాఠశాల యాజమాన్యం ఫిట్‌నెస్ చేయించలేదని, విద్యార్థుల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదని తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌కు సైతం డ్రైవింగ్ లైసెన్స్ లేదని పేర్కొన్నారు. విద్యార్థుల రవాణా కోసం అభ్యాస్ విద్యాపీఠం పాఠశాలకు పరిగి నుంచి రెండు బస్సులు, షాద్‌నగర్ నుంచి మరో బస్సు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పాఠశాలకు చెందిన మిగతా వాహనాల ఫిట్‌నెస్, ఇతర నిబంధనలపై కూడా పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి విచారణ చేపడతామని ఎంవీఐ స్వప్న వెల్లడించారు.

# అభ్యాస్ విద్యాపీఠం గుర్తింపు తక్షణమే రద్దు చేయాలి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- ఎస్‌ఎఫ్‌ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్



**తొలి అక్షరం/షాద్ నగర్, జూలై 24:** చౌదరిగూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో స్కూల్ బస్సు ప్రమాదంలో ఎల్‌కేజీ విద్యార్థిని మృతి చెందిన ఘటనపై ఎస్‌ఎఫ్‌ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారి మృతికి బాధ్యులైన అభ్యాస్ విద్యాపీఠం యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, విద్యార్థుల భద్రత విషయంలో రవాణా, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు. చౌదరిగూడ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాల అమలుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, చౌదరిగూడ ఎంఈఓ పాత్రపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల ముట్టడి సహా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని వడ్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలని డిమాండ్.



**రాస్తారోకో రాలీ లో పాల్గొన్న టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.**






**తొలి అక్షరం/నెక్కొండ జూలై 24:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నెక్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన మరియు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెక్కొండ మండలం టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి , భక్కి అశోక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడియా తిరుమల్, నెక్కొండ సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి, సూరిపల్లి చైర్మన్ మాదాటి శీనువాస్, రెడ్లవాడ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్స్ కేవీ సుబ్బారెడ్డి, కదురు సాంబయ్య, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,బొమ్మెరబోయిన రమేష్,సింగం అరుణ్,బూర్గు నరేష్, తొపనపల్లి సర్పంచ్ చాగంటి మమత-తిరుమల్, గొట్లకొండ సర్పంచ్ భూక్యా జనార్దన్, తొపనపల్లి మాజీ సర్పంచ్ ఫకీర్ భాయ్, సొసైటీ డైరెక్టర్ వంగాల నాగిరెడ్డి, వార్డ్ సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్, కక్కెర్ల ఐలయ్య,నాదెండ్ల ప్రసాద్ పోరండ్ల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు ఐటీ అభివృద్ధి: సుర్వి యాదయ్య గౌడ్







**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 24:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలోని దండు మల్కాపూర్ ఆందోల్ మైసమ్మ ఆలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. తర్వాత గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఐటీ హబ్ సమీపంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రైతాంగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. కేటీఆర్ ఐటీ రంగాన్ని బలోపేతం చేసి రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, మునుగోడు నియోజకవర్గానికి ఐటీ పార్క్ తీసుకురావడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలంటే మళ్లీ భారత రాష్ట్ర సమితి పార్టీ అధికారంలోకి రావాలని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి రావాలన్నా, ఐటీ మరియు పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగవంతం కావాలన్నా కేటీఆర్ వంటి సమర్థ నాయకత్వం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేష్, నల్పరాజు రమేష్, రమణ, గోని రఘు, కృష్ణ, ఏర్పుల రాజేష్, సుర్వి లింగస్వామి గౌడ్, శేఖర్ గౌడ్, యాదగిరి, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు నిర్లక్ష్యం.. యూకేజీ చిన్నారి సహస్ర దుర్మరణం



- చౌదర్‌గూడ మండలంలో హృదయ విదారక ఘటన..
- స్కూల్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్







**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24:** చౌదర్‌గూడ మండలంలో శుక్రవారం చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్యమనీష దంపతుల కుమార్తె సహస్ర (యూకేజీ) స్థానిక అభ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో చదువుతోంది. ప్రతిరోజులాగే ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లిన చిన్నారి, సాయంత్రం ఇంటి వద్ద దించే సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. స్థానికుల వివరాల ప్రకారం...బస్సు ఇంటి వద్ద ఆపిన అనంతరం చిన్నారి దిగిన కొద్దిసేపటికే డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని వెనక్కి తీసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సహస్ర బస్సు వెనుక భాగంలో ఉండటాన్ని గమనించకపోవడంతో బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన చిన్నారిని స్థానికులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో కాస్లాబాద్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సహస్ర మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల రవాణాలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని, బస్సుల వద్ద సహాయక సిబ్బందిని నియమించాలని కూడా కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, డ్రైవర్ నిర్లక్ష్యం, స్కూల్ యాజమాన్యం బాధ్యతలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో మరోసారి పాఠశాల బస్సుల భద్రత, డ్రైవర్ల అప్రమత్తత, విద్యార్థుల రవాణా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నారుల ప్రాణాల భద్రత విషయంలో నిర్లక్ష్యం పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్రపై మాటల యుద్ధం..
# శ్రీధర్ రెడ్డికి టీజేఏసీ ఘాటు సవాల్

**ఉద్యమంలో మీ పాత్ర ఏమిటి?.. పీఆర్టీయూ శ్రీధర్ రెడ్డిని నిలదీసిన టీజేఏసీ నేతలు**



తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24: తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరవీరుల స్తూపం నిర్మాణం అంశాలపై షాద్‌నగర్‌లో టీజేఏసీ, పీఆర్టీయూ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టీజేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్, వైస్ చైర్మన్ కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పీఆర్టీయూ నాయకుడు శ్రీధర్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అరెస్టులకు భయపడి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యక్తి ఇప్పుడు ఉద్యమం గురించి మాట్లాడడం సరికాదని వారు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ వంటి అమరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారి చిత్రాలకు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు ఎప్పుడైనా నివాళులర్పించారా అని శ్రీధర్ రెడ్డిని ప్రశ్నించారు. షాద్‌నగర్ అమరవీరుల స్తూపం నిర్మాణ బాధ్యతను టీజేఏసీ తమ భుజాలపై వేసుకుని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జేఏసీ సన్నాహక సమావేశాలు తమ ఇంట్లోనే జరిగాయని, ఆ విషయం ఉద్యమ నాయకులందరికీ తెలుసని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పుడైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అరెస్టయ్యారా అని శ్రీధర్ రెడ్డిని నిలదీశారు. మరోసారి టీజేఏసీపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలు గౌడ్, బిశ్వ కృష్ణయ్య, బిజిలి సత్యం, వలిగె కృష్ణ, లక్ష్మీదేవమ్మ, బాలయ్య, రాములు, అర్జున్ కుమార్, తావుర్యా, గొర్ల రాము, నక్క బాల్‌రాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# కౌసల్యదేవిపల్లిలో కొత్త వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



తొలిఅక్షరం/నర్సింహులపేట జులై 24: మండలంలోని కౌసల్యదేవిపల్లిగ్రామానికి చెందిన కొత్త వెంకటయ్య అకాల మరణం చెందగా, వారి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ మెంబర్, మాజీ వార్డ్ మెంబర్ అన్నంగి నరేష్ – హరిచందన మృతుని కుటుంబాన్ని పరామర్శించి ₹2000 నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఎల్లప్పుడు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. 'కౌసల్యదేవిపల్లి సేవ ట్రస్టు'ఆధ్వర్యంలో మరో ₹2500 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు నిర్లక్ష్యంతో యూకేజీ చిన్నారి సహస్ర దుర్మరణం

**- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: ఏఐఎస్ఎఫ్ డిమాండ్**





తొలి అక్షరం/చౌదర్‌గూడ, జులై 24: చౌదర్‌గూడ మండలం కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్యమనీష దంపతుల కుమార్తె, అబ్యాస్ విద్యాపీఠంలో యూకేజీ చదువుతున్న చిన్నారి సహస్ర స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఇంటి వద్ద విద్యార్థులను దింపుతున్న సమయంలో బస్సు వెనుకకు తీస్తుండగా చిన్నారి ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చవాన్, రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం, డ్రైవర్ బాధ్యతారాహిత్యమే ఈ విషాదానికి కారణమని ఆరోపించారు. ప్రమాదానికి బాధ్యులైన బస్సు డ్రైవర్‌తో పాటు పాఠశాల యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని స్కూల్ బస్సుల భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతి బస్సులో అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలని, సీసీ కెమెరాలు, రివర్స్ అలారం వంటి భద్రతా ఏర్పాట్లు ఉండేలా అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారి సహస్ర మృతి పట్ల వివిధ ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# నీట్ పేపర్ లీక్: నర్సింహులపేటలో నిరసన జ్వాలలు

**నీట్ పేపర్ లీక్‌పై నర్సింహులపేటలో భగ్గుమన్న ఆగ్రహం.**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం.**

**మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని నేతల డిమాండ్.**





తొలిఅక్షరం/నర్సింహులపేట, జూలై 24: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఈ అక్రమాలకు వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఒక్కటయ్యాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, కేవీపీఎస్ మరియు ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలోని ప్రతిష్టాత్మక పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. పేపర్ లీకేజీలు, అవకతవకలతో విద్యార్థుల్లో తీవ్ర మానసిక ఆందోళన నెలకొందని, ఏళ్ల తరబడి కష్టపడి చదివే నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను కేంద్రం నిర్లక్ష్య ధోరణి ద్వారా కాలరాస్తోందని ధ్వజమెత్తారు. నీట్ నిర్వహణలో జరిగిన భారీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన ఎంతటివారైనా సరే వదిలిపెట్టకుండా, ఈ మొత్తం కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆడుకోవడం మానుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు బండి రమేష్, కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షుడు చిర్ర సతీష్, యూత్ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ యాదవ్, డోనికేనా ఉపేందర్, జంపాల శ్రీకాంత్ తదితరులతో పాటు భారీ సంఖ్యలో బీఆర్ఎస్, కాంగ్రెస్, కేవీపీఎస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లోని పరిశ్రమలను జనసంచారం లేని ప్రాంతాలకు తరలించాలి

**దివ్య శక్తి పేపర్ మిల్లు నుండి వెలబడుతున్న కలుషిత నీరు..**

**కలుషిత నీరు వాగులో కలిసిన ప్రాంతాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు**



తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని పరిశ్రమలను దశలవారీగా తొలగించి, జనసంచారం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు గ్రామ సమీపం లో వెలసిన దివ్య శక్తి పేపర్ మిల్లు ద్వారా కలుషిత నీరు దండాది కాలువలోకి వదలడంతో పరిసరా ప్రాంత రైతుల పొలాలు కాలుష్యంతో పేరుకుపోయిన దృశ్యాలు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య నీరు భూగర్భ జలాలు,చెరువులు, వ్యవసాయ భూములను తీవ్రంగా కలుషితం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా పంట భూములు సాగుకు అనువుగా లేకుండా పోతున్నాయని,రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేయకుండా విడుదల చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని అన్నారు. పరిశ్రమల వల్ల ఉపాధి అవకాశాలు పెరగడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ,ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు,నివాస ప్రాంతాలకు దూరంగా పరిశ్రమలను తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బక్కని నరసింహులు డిమాండ్ చేశారు.

## ఆర్థిక సహాయం అందించిన దైద రవీందర్



తొలి అక్షరం/రామన్నపేట జులై 24:నకిరేకల్ మూసి రోడ్డు పద్మశాలి కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన పెండం శ్రీనివాస్ మాతృమూర్తి పెండం పిచ్చమ్మ మృతి చెందగా వారి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేసిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సర్పంచ్‌కి వినతి పత్రం



తొలి అక్షరం/రామన్నపేట జూలై 24: రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో మద్యం అమ్ముతున్న అమ్మకం దారులు ఈనెల 20వ తారీకు గ్రామ సభలో నిర్ణయించిన తీర్మానానికి కట్టుబడి ఉంటామని ఆగస్టు ఒకటో తేదీ నుంచి గ్రామంలో ఎలాంటి మద్యం అమ్మమని గ్రామపంచాయతీ తీర్మానానికి కట్టుబడి ఉంటామని గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి కి అమ్మకం దారులువినతి పత్రం అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఎం. జ్యోతి అంబటి రవీంద్ర రెడ్డి మాదూరి రమేష్ వార్డు మెంబర్లు గాదె శంకరయ్య కట్ట భాను శ్రీ గాదే.యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో కేటీఆర్ పాత్ర విశేషమని, యువత కోసం ఆయన చేసిన కృషి, పరిపాలనా దక్షత ప్రతి నాయకుడికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆధునిక ఆలోచనలతో తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించగా, షాద్‌నగర్ పార్టీ కార్యాలయానికి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, రాంబాల్ నాయక్, రాజవరప్రసాద్, రాజ్యలక్ష్మితో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపుమేరకు నెల్లికుదురులో నిర్వహణ**

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 24: నెల్లికుదురు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పిలుపుమేరకు నెల్లికుదురు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, నెల్లికుదురు మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బత్తిని అనిల్ శ్రీరామగిరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ భోజ్యా నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి వరిపెల్లి వెంకటేష్, మండల యూత్ ఉపాధ్యక్షుడు కారం ప్రశాంత్, బీఆర్ఎస్వీ మండల నాయకులు తూళ్ల వివేక్, మంచాల రాంమల్లు, వెంకన్న, మహేష్, ప్రవీణ్, సాయి వర్ధన్, బాణాల సంజీవ్, హెచ్చు అశోక్ తదితరులు పాల్గొన్నారు

## కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా.. ఎఫ్‌సీఎన్ అనాథాశ్రమంలో అన్నదాన సేవ




తొలి అక్షరం/షాద్ నగర్, జులై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్‌లోని ఎఫ్‌సీఎన్ అనాథాశ్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం బీఆర్ఎస్ సంప్రదాయమని, సమాజంలోని నిరుపేదలు, అనాథలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వృద్ధులకు భోజనం వడ్డించారు. షాద్‌నగర్, జిల్లేడు–చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రణబలి విడుదలపై అయోమయం

## దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం




కథానాయకుడు విజయ్ దేవరకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చునే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ - అతుల్ సంగీతమందిస్తున్నారు.

# మరో డిఫరెంట్ ప్రేమకథ.. చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్థంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతారవణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

# విశ్వనాథ్ అండ్ సన్స్... తమిళ సినిమానే

## తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తున్నాం




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్యకు జోడీగా యువ నటి మమితా బైజు నటిస్తుండగా, ఆగస్టు 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై చాలా రోజులుగా ప్రచారంలో ఉన్న ఒక ముఖ్యమైన విషయానికి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటివరకు ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి చిత్రీకరించిన ద్విభాషా సినిమాగా చాలా మంది భావించారు. అయితే అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్‌ను పూర్తిగా తమిళ భాషలో మాత్రమే చిత్రీకరించాం. తర్వాత తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేస్తున్నాం. ఇది బైలింగ్వల్ సినిమా కాదు' అని వెల్లడించారు. దీంతో ఈ చిత్రంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తెలుగు నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న కారణంగా ఈ సినిమాను చాలా మంది తెలుగు-తమిళ ద్విభాషా చిత్రంగా భావించారు. కానీ దర్శకుడి తాజా వ్యాఖ్యలతో ఇది తమిళ చిత్రంగానే రూపొంది, తెలుగులో డబ్ అవుతున్న సినిమా అని స్పష్టమైంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు, సూర్య స్టైలిష్ లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపిన కథతో ఈ సినిమా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# మంగళవారం మూవీకి సీక్వెల్




తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా విడుదలైన తర్వాత పూర్తిస్థాయిలో 'మంగళవారం 2' స్క్రిప్ట్‌పై దృష్టి పెడతానని తెలిపారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'మంగళవారం 2' కథను అజయ్ భూపతి దర్శకుడు కొరటాల శివకు వినిపించినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో ఆయన తన నిర్మాణ సంస్థ యువసుధా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అజయ్ భూపతి తాజా వ్యాఖ్యలతో 'మంగళవారం 2' టాలీవుడ్‌లో ఇప్పటి నుంచే హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'ది ఒడిస్సీ'ని మహాభారతంతో పోల్చిన ఆషికారంగనాథ్!



హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన -ది ఒడిస్సి- వరల్డ్ వైడ్ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. భారత్ లోనూ సినిమాకు అసాధారణమైన ఫాలోయింగ్ దక్కుతోంది. రొటీన్ సినిమాలు చూసి బోర్ కొట్టిన జనాలంతా ఒడిస్సీ వైపు మళ్లుతున్నారు. -అవతార్- తర్వాత ఆ రేంజ్ సినిమా లేకపోవడంతో? ఒడిస్సికి ప్రేక్షకులంతా పట్టం కడుతున్నారు. సినిమా లో శాస్త్రీయత, మానసిక భావోద్వేగాలు , విజువల్ వండర్స్ ఎంతగానో ఆకట్టుకుం టున్నాయి. తాజాగా ఈసినిమా గురించి టాలెంటెడ్ హీరోయిన్ ఆషికా రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సినిమాలోని కొన్ని కీలక అంశాలు మన పురాణాలైన మహాభారతాన్ని తలపించేలా ఉన్నాయని ఆషికా అభిప్రాయపడ్డారు. క్రిస్టోఫర్ నోలన్ కథా శైలి , ఆయన ఎంచుకున్న దృశ్యాలు తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. -ది ఒడిస్సీ- చిత్రానికి సంబంధించిన విశేషాలను పరిశీలిస్తు న్నప్పుడు అందులోని సంఘర్షణలు, పాత్రల ప్రయాణం అచ్చం మన భారతీయ ఇతిహాసమైన మహాభారతంలోని ఘట్టాలను గుర్తుచేశాయని వెల్లడించారు. పశ్చిమ దేశాల పురాణ గాథ అయినప్పటికీ అందులో లోతైన భావోద్వేగాలు.. సత్యాలను పోలి ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గొప్ప కథలన్నీ మానవ స్వభావం, ధర్మం, పోరాటం చుట్టూనే తిరుగుతాయని చెప్పడానికి ఈ పోలిక ఉదాహరణగా నిలుస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి టెక్నాలజీతో తెరకెక్కిన ఇలాంటి గ్లోబల్ ప్రాజెక్ట్‌లు భారతీయ సాంస్కృతిక ఇతిహాసాలతో ఎంతగా కనెక్ట్ అయి ఉంటాయో ఈ వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఆషికా రంగనాథ్ చేసిన కామెంట్స్ చర్చకే పరిమితం కాలేదు. ఈస్ట్ .. వెస్ట్ కల్చర్స్ మధ్య ఉన్న కథా పరమైన సారూప్యతలను బయటపెట్టాయి. ఏ దేశంలో పుట్టిన కథ అయినా? మూలాలు , నైతిక విలువలు ఒకేలా ఉంటాయని చెప్పడానికి ఇది నిదర్శనమని మరోసారి తేట తెల్లమవుతోంది.-అవతార్- కాన్సెప్ట్ కూడా భారత్ మూలాల నుంచి తీసుకున్నదే. ఆసినిమాలో పాండోరా ప్రపంచం, నావి జాతి జీవన విధానం, ప్రకృతితో వారికున్న విడదీయరాని అనుబంధం ఇవన్నీ అచ్చమైన భారతీయ సంస్కృతికి, హిందూ పురాణాలకు అద్దం పడుతున్నట్లుగా ఉంటుందనే చర్చ ఎప్పట్నుంచో ఉంది. ముఖ్యంగా ఈ చిత్రంలోని పలు కీలక అంశాలు భారత దేశపు ప్రాచీన మూలాలను గుర్తు చేస్తుంటాయి. సినిమాలో మానవులు నీలం రంగులో చూపించే నావి జాతి పాత్రలు, వాటి రూపురేఖలు హిందూ పురాణాల్లోని దైవిక రూపాలను పోలి ఉంటాయి.

# అమెరికా ప్రచారంలో రామాయణ టీమ్

దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతోన్న ప్రముఖ శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్ర బృందం పాల్గొని సందడి చేసింది. రణ్‌బీర్ కపూర్, యశ్, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు నిర్మాత నమిత్ మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్‌పై యశ్ ప్రశంసలు కురిపించారు.

'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. రణ్‌బీర్ కపూర్ గొప్పగా నటించాడు. ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసినప్పుడు అతడి నిబద్ధత కనిపిస్తుంది. ఇలాంటి సినిమాను చిత్రీకరించాలంటే సంకల్ప బలం ఉండాలి. మంచి టీమ్ ఉన్నప్పుడు ప్రతీది కలిసి వస్తుంది. ఈ సినిమా ప్రారంభించాక జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాం. మేకప్ నుంచి లుక్స్ వరకూ సాంకేతికంగా ఇది ఎంతో సవాలుతో కూడుకున్న పని. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని యశ్ అన్నారు. ఈ సినిమా ట్రైలర్ నేడు విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని టీమ్ భావిస్తోంది. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు.

-------------

